ఘనంగా ఉగాది వేడుకలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం

రాంనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో మంగళవారం క్రోధినామ ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. బాగ్‌లింగంపల్లి సుందరయ్యపార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఆర్.వివేక్ ఆధ్వర్యంలో ప్రముఖ వేదపండితులు బ్రహ్మశ్రీ అనంతాచార్యులచే పంచాంగ శ్రవణం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా.గోపాల్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాసరావు, ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, మాజీ అధ్యక్షుడు బబ్లూ, సభ్యులు పాల్గొన్నారు.

● బాగ్‌లింగంపల్లి శ్రీరామ్‌నగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు హరినాథ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరిగాయి. రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి ముఖ్యఅతిథిగా పాల్గొని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

● కందూరి కృష్ణ ఫౌండేషన్, సేర్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ వీధిలో పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. కందూరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ ఇంజనీర్ తొడుపునూరి అరుణ్ ప్రమోద్ ఆగర్వాల్, గోవింద్‌రాజ్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

● బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో గల మైసమ్మ దేవాలయంలో ఉగాది పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల శివకుమార్, సభ్యులు కిరణ్ కుమార్, అరవింద్‌కుమార్, నారాయణరావు, సతీష్, మణీష్‌కుమార్, ఇంద్రావతి, గాయత్రి, పూజ తదితరులు పాల్గొన్నారు.

● రాంనగర్ రామాలయంలో ఉగాది ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరమణాచారి, వెంకటరమణాచార్యులు, వేణుగోపాల్, ఆలయ కమిటీ చైర్మన్ డి.రవియాదవ్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

● రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జెమినికాలనీలో పంచాంగ శ్రవణం, పచ్చడి, బొప్పట్ల వితరణ జరిగింది.

కవాడిగూడ: ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం మంగళవారం నిర్వహించారు. ఆచార్య పార్థసారథి వాకింగ్‌కు వచ్చిన వారికి పంచాంగ శ్రవణం వినిపించారు. కార్యక్రమంలో ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ. సుధాకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఎం. శ్రీనివాస్ ముదిరాజ్, ప్రభాకర్ యాదవ్, శ్రీనివాస్, నరేందర్, టీకేఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాకర్స్ ఉగాది పచ్చడి, బొప్పట్లు పంపిణీ చేశారు.



భోలక్‌పూర్ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో కమిటీ సభ్యులు



నల్లకుంటలో ఉగాది పంచాంగం ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు

వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

చిక్కడపల్లి: ఉగాది సందర్భంగా చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఉదయం ఆరు గంటల నుంచే ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. సాయంత్రం పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఆలయ ఉపప్రధాన అర్చకులు నారాయణచారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి. రాజేంద్ర నాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె. రామాంజనేయులు మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీ ఉదయం 11.30 గంటలకు శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.



సుందరయ్య పార్కులో ఉగాది వేడుకల్లో ఎంపీ డా. కె. లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

కవాడిగూడ: డివిజన్‌లో పలు దేవాలయాల్లో తెల్లవారు జాము నుంచే భక్తులు పూజలు నిర్వహించారు. బాలాంజనేయస్వామి, సంకట విమోచన, లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ, జగదీష్ మందిర్, షిరిడిసాయి బాబా, దోమలగూడలోని హనుమాన్ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ముషీరాబాద్: భోలక్‌పూర్‌లో భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయంలో ఉగాది పంచాంగ శ్రవణం మంగళవారం సాయంత్రం జరిగింది. ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్ట్ చైర్మన్ నల్లవెల్లి అంజిరెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పంచాగం ఆవిష్కరణ

నల్లకుంట: బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంటలో సమితి కార్యాలయంలో క్రోధి నామ సంవత్సరం ఉగాది పంచాగం ఆవిష్కరించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ఉపాధ్యక్షులు పి. రంగారావు, ఆర్‌కే దేశ్‌ముఖ్, ప్రధాన కార్యదర్శి సునీల్, జిల్లా సహాయ కార్యదర్శి డి. అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



శ్రీరామ్‌నగర్ పోచమ్మ ఆలయంలో ఉగాది వేడుకల్లో కార్పొరేటర్ కె.రవిచారి, బస్తీ అధ్యక్షుడు హరినాథ్ తదితరులు



ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న ఆచార్య పార్థసారథి



బతుకమ్మకుంట మైసమ్మ దేవాలయంలో ఉగాది వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ కోట శివకుమార్ తదితరులు



చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ వీధిలో పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న కందూరి కృష్ణ ఫౌండేషన్ చైర్మన్ కె. కృష్ణ, ప్రముఖ ఇంజనీర్ టి. అరుణ్ తదితరులు



దానం నాగేందర్‌ను సత్కరించిన అభిజిత్ యాదవ్ తదితరులు

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి

ఎన్ఎస్‌యూఐ ప్రధాన భూమిక పోషించాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగిరేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ అభ్యర్థి దాన నాగేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్ఎస్‌యూఐ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎడ్ల అభిజిత్‌యాదవ్ ఆధ్వర్యంలో దానంను, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డిని సన్మానించారు. దానం నాగేందర్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రధాన భూమిక పోషించాలని సూచించారు. పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో అభ్యర్థుల విజయానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీకర్, నగర కార్యదర్శి సాయికుమార్, ఉపాధ్యక్షుడు సాయి, అబేద్ తదితరులు పాల్గొన్నారు.



నరేంద్రకు నివాళులర్పిస్తున్న వినయ్‌కుమార్, ఉమేష్ తదితరులు

ఆలె నరేంద్ర ఆశయాల సాధనకు కృషి

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హిందూ వ్యతిరేకులపై పోరాడిన యోధుడు టైగర్ ఆలె నరేంద్ర అని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్ కార్పొరేటర్ కార్యాలయంలో నరేంద్ర వర్ధంతి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వినయ్‌కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ ఎం. ఉమేష్, నాయకులు రాజాగౌడ్, శ్రీకాంత్, నర్సింహ, దోనేటి సత్యం, వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

'రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలు'

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం రైతాంగ సేద్యం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలవల్లే రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. రైతులు సమస్యలపై సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాగర్, అరిబండి ప్రసాదరావు, సారంపల్లి మల్లారెడ్డి, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల డిమాండ్లను బీజేపీ మేనిఫెస్టోలో చేర్చాలి

● ప్రధాని మోదీకి ఆర్. కృష్ణయ్య లేఖ

రాంనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీసీల డిమాండ్లను బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మంగళవారం లేఖ రాశారు. లేఖకు సంబంధించిన అంశాలను విద్యానగర్‌లో బీసీ భవన్‌లో గురువారం విలేకరులకు తెలియజేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు ఎంపీ సీట్లు కేటాయించాలని లేఖలో కోరామన్నారు. బీసీలు ఉన్నత చదువులు, ఉద్యోగాలు పొందేందుకు బీసీ స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలని, బీసీ కుల వృత్తులను ప్రోత్సహించాలని, ఇందుకు బడ్జెట్ కేటాయించాలన్నారు.



పురస్కారాలు అందుకున్న కళాకారులతో నాగేశ్ ముదిరాజ్

పిల్లలకు నాట్యంలో శిక్షణ ఇప్పించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులను సన్మానించుకోవడం మంచి సంప్రదాయమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగేశ్ ముదిరాజ్ అన్నారు. బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో శాస్త్రీయ, ఆధునిక నృత్యప్రదర్శనలు నిర్వహించిన చిన్నారులు, వివిధ రంగాలవారికి క్రోధి నామ ఉగాది పురస్కారాల బహూకరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన పురస్కారాలను బహూకరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు నాట్యంలో శిక్షణ ఇప్పించాలని కోరారు. నిర్వాహకులు విక్కీ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడు బీజేపీలో చేరిక

గోల్నాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గతంలో బీజేపీలో ఉన్న కె. కృష్ణ బీఆర్ఎస్ చేరాడు. మంగళవారం తిరిగి బీజేపీలో చేరాడు. ఆయనకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. బీజేపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, డివిజన్ ప్రధానకార్యదర్శులు ఆర్‌వీఎల్. రమేష్, కె. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషిచేయాలి



జెండా ఆవిష్కరణలో పీఎన్ చారి, జి. వెంకటేష్, ఎంసీ మహేందర్‌బాబు తదితరులు

కవాడిగూడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓంకార్‌నగర్‌లో పార్టీ జెండాను బూత్ నంబర్ 65 కో-ఆర్డినేటర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీఎన్‌చారి, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేష్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బూత్ కమిటీ సభ్యులు సత్తయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ప్రారంభం

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్‌లో ఆంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 25వ తేదీ వరకు వార్షికోత్సవాలు జరుగుతాయి.

● ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోగల లక్ష్మీగణపతి దేవాలయం ప్రాంగణంలోని కోదండరామచంద్రస్వామి మందిరంలో స్వామివారి వసంత నవరాత్రోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆచారి పంచాంగశ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం జరిగింది.

ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక

ముషీరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్ సిద్దిక్‌నగర్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందును ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి ప్రారంభించి ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, నాయకులు జునేద్‌బాగ్దాదీ, ఎజాజ్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో..

అంబర్‌పేట: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో అంబర్‌పేటలో మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి టి. పద్మారావుగౌడ్, మాజీ మంత్రి మహమూద్ అలీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్లు విజయకుమార్‌గౌడ్, బి. పద్మ, మాజీ కార్పొరేటర్ కె. పద్మావతి తదితరులు హాజరయ్యారు.



అంబర్‌పేటలో ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ మంత్రి మహమూద్ అలీ తదితరులు

చట్టసభల్లో క్రైస్తవుల ప్రాతినిధ్యం పెంపునకు కృషి

పంజాగుట్ట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో క్రైస్తవుల ప్రాతినిధ్యం పెంచేందుకు కృషి చేస్తామని నేషనల్ క్రిస్టియన్ బోర్డ్(ఎన్‌సీబీ) అధ్యక్షుడు జాన్ మార్క్స్ తెలిపారు. మంగళవారం ఎర్రమంజిల్‌లోని హోటల్ మెర్క్యురీలో క్రిస్టియన్ మతపెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో దేశవ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, పాస్టర్లపై అక్రమ కేసులు, పరిష్కారమార్గాలపై చర్చించారు.

ఈ సందర్భంగా జాన్ మార్క్స్ మాట్లాడుతూ.. మణిపూర్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో క్రైస్తవులపై దాడులు జరిగినా ఏ ఒక్క రాజకీయ పార్టీ ప్రశ్నించలేదని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 400కు పైగా సీట్లలో పోటీచేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. క్రైస్తవులపై దాడులు అరికట్టడంతో పాటు క్రైస్తవ ఆస్తుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, ప్రతి రాష్ట్రంలో క్రైస్తవ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, పాస్టర్లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, క్రిస్టియన్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు పీటర్, జాన్ వెస్లీ, నవీన్ కుమార్, సురేష్, జామవా సామేల్, డేవిడ్ మార్క్స్, కాశీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌సీబీ అధ్యక్షుడు జాన్ మార్క్స్

ఆలయంలో నిద్రించే స్థలం విషయమై గొడవ

● ఒకరి మృతి

పహాడిషరీఫ్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ కాలనీలో పోచమ్మ ఆలయంలో నిద్రించే స్థలం విషయమై జరిగిన గొడవలో ఓ వ్యక్తి మరణించాడు. మహారాష్ట్రకు చెందిన కామ్‌సింగ్ కూలి పనిచేస్తుంటాడు. సోమవారం అర్ధరాత్రి శ్రీరామ్ కాలనీలో పోచమ్మ ఆలయం వద్ద నిద్రపోతున్నాడు. అదే కాలనీకి చెందిన కూలి పనులు చేసే నేనావత్ రోజూ రాత్రి సమయంలో పోచమ్మ ఆలయంలో నిద్రపోతాడు. తాను నిద్రపోయే స్థలంలో సోమవారం రాత్రి కామ్‌సింగ్ పడుకోవడంతో ఆగ్రహం చెందాడు. అక్కడినుంచి వెళ్లిపోవాలని కోరాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపంతో నేనావత్ పక్కన ఉన్న కర్రతో కామ్‌సింగ్ తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. పహాడిషరీఫ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో దంపతులపై దాడి

కొత్తపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కొందరు వ్యక్తులు దుర్భాషలాడుతూ దంపతులపై దాడి చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం హస్తినాపురం షిరిడీ సాయినగర్‌లో జరిగింది. ఓ భవనం మొదటి అంతస్తులో పి.సైదాచారి, భారతి దంపతులు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో యాదయ్య, అరుణ దంపతులు ఉంటున్నారు. యాదయ్య స్నేహితులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో మద్యం తాగి అసభ్యపదజాలంతో కేకలు వేశారు. దీంతో ఇరుగు, పొరుగు వారు అసౌకర్యానికి గురయ్యారు.

సాయంత్రం యాదయ్య, అరుణ దంపతులు, స్నేహితులు సైదాచారి ఇంట్లోకి చొరబడ్డారు. అడ్డుకునేందుకు యత్నించిన సైదాచారి, అతడి భార్య భారతిపై దాడి చేసి అసభ్యపదజాలంతో దూషించారు. పక్కింట్లో ఉండే భరత్‌కుమార్‌కు చెందిన కంప్యూటర్‌ను ధ్వంసం చేశారు. భవనం ఆవరణ మందుబాబుల అరుపులు, కేకలతో దద్దరిల్లింది. భారతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మోదీ సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బర్కత్‌పురలో బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల అనంతరం ఎన్నికల ప్రచార రథాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత, మేధావులు, విద్యావంతులు మోదీ పాలనను సమర్థిస్తున్నారని, మూడోసారి ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజల అండదండలతో సికింద్రాబాద్ నుంచి రెండోసారి ఘన విజయం సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్.ఎన్.గౌతమ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, నాయకులు ఓ. శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఏ. సూర్యప్రకాష్‌సింగ్, ఓబీసీమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ముషీరాబాద్ జాయింట్ కన్వీనర్‌గా మహేష్‌కుమార్



ముషీరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మహేష్‌కుమార్ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆయనకు మంగళవారం నియామకపత్రం అందజేశారు. మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా మల్లేష్



గోల్నాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాగ్‌అంబర్‌పేట డివిజన్‌కు చెందిన జి. మల్లేష్‌ను నియమించారు. ఆయన నియామకాన్ని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ మంగళవారం ప్రకటించారు. మల్లేష్ మాట్లాడుతూ.. బీజేపీ పటిష్ఠానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

వారం రోజులుగా నీరు రాక ప్రజల ఇబ్బంది

రాంనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ వడ్డెరబస్తీలో వారం రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చిలకలగూడ, అడిక్‌మెట్ జలమండలి రిజర్వాయర్ నుంచి ఈ బస్తీకి రెండు రోజులకు ఒకసారి నల్లాల ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. వారం నుంచి నీరు రాకపోవడంతో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోయారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కవాడిగూడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు పేకాటరాయుళ్లను గాంధీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 7,400 స్వాధీనం చేసుకున్నారు. నూబోయిగూడలో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దాడిచేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ అతిగా మాట్లాడొద్దన్నారని

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలిక

బర్కత్‌పుర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ అతిగా మాట్లాడొద్దన్నారని మందలించడంతో మనస్తాపం చెందిన ఓ బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. నిజామాబాద్‌కు చెందిన బాలాజీరావు కుటుంబ సభ్యులతో కలిసి నగరంలో శుభకార్యానికి ఈనెల 8వ తేదీన వచ్చాడు. కాచిగూడ పీఎస్ పరిధిలోగల సుందర్‌నగర్‌లో బంధువుల ఇంట్లో ఉన్నారు. అతడి కుమార్తె సీహెచ్ గౌరి(13) ఎనిమిదవ తరగతి చదువుతోంది. సెల్‌ఫోన్ అతిగా మాట్లాడుతుండడంతో తల్లి, సోదరుడు మందలించారు. మనస్తాపం చెందిన బాలిక మంగళవారం ఉదయం 8.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. బాలిక ఆచూకీ లభించకపోవడంతో సోదరుడు కె. విష్ణుకార్తీ మంగళవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రావు

చార్మినార్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్థుడిని భవానీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు, రెండు ఏసీ కంప్రెషర్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వరరావు భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్ఐ అంకిరెడ్డి వివరాలు వెల్లడించారు,

అమన్‌నగర్, మౌలాకాచిల్లా ప్రాంతానికి చెందిన మహ్మద్ మొహిసిన్ షరీఫ్ డిగ్రీ వరకు చదివాడు. జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. ఈనెల 7న తలాబ్‌కట్టలో కూల్ కేర్ కూలింగ్ సిస్టంలో రెండు ఏసీ కంప్రెసర్లు చోరీ అయ్యాయి. యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి మహ్మద్ మొహిసిన్ షరీఫ్ చోరీ చేసినట్టు గుర్తించారు. అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరం చేసినట్టు, ఎల్బీనగర్, మంగళహాట్, షాహిమ్‌గంజ్‌లో ద్విచక్రవాహనాలు చోరీచేసినట్టు అంగీకరించాడు.